# అసలు తెలుగుభాష

శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు

(ఆనందవాణికి ప్రత్యేకం)

డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు రాజకీయములను తీసుకుంటే చేటలు చెరగేసినట్లు ఇంగ్లీషులోను తెలుగులోను వ్రాయగలరు మాట్లాడగలరని మనమందరం ఎరుగుదుము. అతనికి సాంఘిక సమస్యలయందు గల అనుభవము పాండిత్యము ఆ ప్రజ్ఞకేమాత్రమును తీసిపోవని ఈ వ్యాసముద్వారా రుజువుకాగలదు. సంభాషణలేక వాడుక భాషలో ఎంతపటుత్వ ముంటుందో తెలియపరచుటకును, దానిని వేరువిధమగు భాషలోనికి తర్జుమాచేయుట యెంతో కష్టమని తెలుపుటకును డాక్టరుగారు ఈ విషయములను వ్రాసినారు. ఈ వ్యాసము నందలి భాషభావ సౌందర్యములను మించుచున్నదో, భావము భాషాసౌందర్యమును బురడించుచున్నదో నిశ్చయించుకొను భారమును పారకులకే విడచిపెట్టుచున్నాము.

ఆ॥ సం॥

ఈ ముక్కలు నాలుగు వ్రాందామని బుద్ధి పుట్టింది-ఎప్పుడూ ?

కూలివాళ్లకు పనిచెపుతు-నేనువాళ్లతో కలిసి మెలిసి పనిచేస్తూన్నప్పుడు, వాళ్లతో అన్నాను. "చక్కగా ఆ కర్రలన్నీ పొదుపుగా కట్టకట్టి, వాడండి" అన్నాను.

అప్పుడప్పుడు చిన్నపిల్లలనుచూచి ఎంతో ముచ్చటపడతాము. వాళ్ల! పొందిక - వాళ్ల ఆరిందా మాటలు వింటే నవ్వొస్తుంది. కొందరేమో అతిచనువుగా అట్టే దగ్గరకువస్తారు. కొందరు-నీవు ఎంత బ్రతిమాలు-ఊఁహూ, మాటవింటారా? అదేమి మా రాముళ్లు!-వాళ్లమాటేమాట- ఓమంచి-ఓ మాకు ఏమైనాఉందా ? పిల్లల తప్పటిడుగులువచ్చి రానిమాటలు-ఊరీఊరని ఊరగాయలల్లే ఎంతో రుచిగావుంటాయిఅంటారే-అది నిజం.

పరాయివాళ్లైతేమి-మన పిల్లలైతేం-అందం-ముద్దుఅంతాఒకటే. కాకిబిడ్డ కాక్కిముద్దుఅనరూ ! నలుపైతే-ఎర్రుపైతేం- తెల్లజామకాయలాగ వెలవెలలాడుతూంటే సరా ! మొగంలో కళకాంతి అక్కరలా ? నల్లటిముఖంలో తెల్లటి పళ్లవరుసచూడు, ఎంత అందంగావుంటుందో !

కొందరకు కనుబొమ్మలు కలుస్తాయి పెనిమిటికి చేటుఅంటారు-నిక్షేపంలాగ కాపురం చేస్తున్నవాళ్లను చూచాం-50 ఏళ్లు వయస్సు మనుమలు మనుమరాళ్లు, పెళ్లిపేరటం-ముచ్చటలు అచ్చట్లు-ఒక్క వైభవమా? శిరిసంపత్తు-పేరుప్రతిష్ఠ, నిన్నే చూడండి అంటూ వుంటారు.

ఎమిటో పూర్వపు సామెతలు సాముద్రికాలు-అబద్దం అనలేంగాని-అన్నీ నిజంకావు సుమా!

ఆడవాళ్లకి కాళ్లమీద వెంట్రుకలుండరాదంటారు. మొగవాళ్ళకు-కాలివేళ్లు రెండోది బొటనవేలికంటె పొడుగుండరాదంటారు. అవి చూచాం, ఇవి చూచాం- మాకేం సెబ్బరు కలిపించలేదనే చెప్పాలసి వస్తుంది.



అబ్బాయిలెంతమంది? అమ్మాయిలు పెళ్ళిళ్ళయినాయా? ఎక్కడ ఇచ్చారు? వాళ్ళకు పాడిపంట ఉందా?

ఏమిటో ఈ రోజులలో చదువులు ఉత్తవయినాయి, వేలకువేలు పొయ్యడమేకాని బూడిదలో పోసిన పన్నీరు అవుతోంది.

పొద్దర్రా ఈ చదువు అంటే మరి పిల్లాళ్లను ఏంచెయ్యం? వీధులంబడి గాడిదలులాగ తిరుగుతారే, అంటారు. అదే నా మెరుగు గులాంగిరీకంటెను తాలూకా కచేరీలవెంట తిరగడంకంటే - అంటే వినిపించుకుంటారూ? పోనియ్యండి ఏల్లాఅయినా, స్కూలు పైనలు అయితే తరువాత చూచుకుందాం-అంటారూ. ఏమిటి చూచుకొనేది?-తాకట్టు పెట్టిన ఇల్లు-అమ్మేసిన పాటిదొడ్డి-త్రవ్వేసిన పొయ్యిలేగాదూ?

కాబట్టి, పిల్లలకుకూడా నచ్చచెప్పాలి.. అబ్బాయి, లాభంలేదు. ఈ చదువులు. వాటికి పోసే నాలుగు రాళ్లు ఇంట్లోవుంటే ఏతవుడో అమ్ముకొని బ్రతకవచ్చు-లేదా పిత్రార్జితమయిన ఆ కొంప గోడు అంటూ మిగులుతాయిగా- ఇప్పుడు ఏమి-ఇంట్లో పెట్టెలు తెరిచి పారబోస్తున్నామా రూపాయలు? ఏదో కొమ్మో గోతమో అమ్మేగదా?-లేకపోతే తాకట్టు, పెట్టి గదా ఇస్తున్నాము. అనాలుగూడబ్బులు మనకు ఆదాఅవుతాయి. అవి బెట్టి, ఏ కాడి దున్నలనో కొనుక్కుని భోభోఅంటే ఓ బస్తా గింజలువస్తే-నలుపుకు తినొచ్చు. దీనికి తోడు ఒక గేదెగొడ్డును పెట్టుకున్నామా, దానిగడ్డి

గ్రట గట్లమీద కనుమలమీదనుంచి కోసి తెచ్చుకోవచ్చునా? ఇలా కాలాక్షేపం కావాలి కాని-ఇంక పూర్వ్వపుప్లీడరీలు డాక్టరీలు- సంపాదనలు ఒందలు-వేలు-వస్తాయి అనా. మీ ఊహ ?చూడండి మన గవర్నమెంటు ప్లీడరుగా వుంజి-జిల్లా జడ్జీగా పించను తీసుకుని-కలక్టరు పనికూడా చేసిన వారి పిల్లలు-ఏ తాలూకాలో ఏ మునసబుకోర్టులోనో- గుమస్తా-అమీనా-ఏదో. ఒకపని ఆఖరుకు బంట్రోతుపనికూడా చేసి-దానికి గౌరవంకోసం అటెండరు అనిపించుకుని కాలం గడుపుకోవడంలా ? 4 అంకెలలో సంపాదనకాలం అయిపోయింది. మూడు అంకెల రోజులు గడిచిపోయినవి. రెండు అంకెలలోకి దిగింది. గవర్నమెంటు నౌకరీ-ప్లీడర్లు డాక్టర్లు ఇంజనీర్లు మాష్టర్లు అవుతాము అన్న ఆశలు అడుగంటాయి-ఏదో తండ్రి సంపాదించిన కాలంలో 10 బస్తాలు ధాన్యంవస్తే పై ఖర్చుకు సంపాదించుకుంటే చాలును అన్నకాలం ఇది.

ఇంకో బాధ - ఏలాగో 4 వేలు సంపాదించి పెద్దవాళ్లు ఇళ్లుకట్టిఇస్తారు. ఓ బస్తీఏమిటి, ఓ పల్లెటూరు ఏమిటి ? ఈ పన్నులు ఇచ్చుకోలేక చావుగావుంది. ఇంటిపన్ను-చదువుపన్ను లాంతరపన్ను-ఒకటేమిటి ? తలుపు, వాకిలి, అమ్మిఇయ్యవలసిందేకాని - ఇంకోమార్గం కనుపించదు.

పోనీ ఇల్లువాకిలిఅమ్మివేసి గ్రామం చేరుకుదామాఅంటే-అక్కడి పట్టింపులుపార్టీలు ఉంఅంటే తంటా-ఆం అంటే తంటా ఏమి అనకుండావుంటే అన్నిటికంటె తంటా వారు వీరు కొట్లాడేది. నిజంచెప్పమనేది ఓరు చెప్పొద్దనేది ఓరు-ఏమీ చెప్పకపోతే ఉభయులకువిరోధమే. ఎల్లా ఏడుస్తుంది ?

ఇప్పట్లో పల్లెటూరిజీవనం చాలాకష్టం. ప్రతికులానికి కొన్ని కొన్ని మెరుగులు కొద్దిపాటితరుగులు ఉన్నాయిగాని లేకపోలేదు. రాజులకు క్షత్రియులకు కోపంవస్తే కత్తిపుచ్చుకుపొడుస్తారు. రెడ్లకు కోపంవస్తే దుడ్డుకర్ర నెత్తిమీదపెట్టారు-వెలమవారికి కోపం వస్తే మీసం డేసి కోరచూపులుచూస్తారు. బ్రాహ్మలకు కోపంవస్తే కాకితంచూస్తానని, పుచ్చుకొని ఆతురం దిద్దుతారు. కమ్మవారికి కోపంవస్తే మూడుకోర్టులుత్రిప్పి మూడు చెరువులనీళ్ళు తాగిస్తానంటారు. కాపులకు కోపంవస్తే నిప్పుపుల్లగీసి కొంప కుప్పకోపెట్టుతారు. కోమట్లకు కోపంకొ రానేరాదు-అయ్యా! బాబూ! అంటూనే వడ్డీలు పెంచుతారు. ఖాతా నోటుఅవుతుంది. నోటు తణఖాఅవుతుంది.

ఈలా వ్రాస్తే ఇతర కులాలనిఅన్నప్పుడు తక్కినవారికి సంతోషమేకాని-తమమీదమాత్రం ఈగవాలకూడదు అంటారు. సోమయాజులు సోమిదేవిహాస్యం విని పగటి భాగవతులకు డబ్బుఇస్తారుకాని సుబ్బిశెట్టి హాస్యం వినేసరికి ఎక్కడలేని కోపంవస్తుంది.

జైళ్లలో చాలా బాధపడ్డాం. ఇంకబాపనాళ్ళలోఉండే వేరులు వ్యత్యాసాలు చెప్పనే అక్కరలేదు. వెలనాట్లకు తెలగాణ్యాణులంటే నియోగులకంటే హీనముఅని అభిప్రాయం. ఈ

మధ్య నియోగుల వైదికుల పెళ్లిజరిగిందట. అందులో విందులు జరిగి ...

అబ్బా ఎండలు ముదుతున్నాయయ్యా-

ఎండలు ముదరడమా? ఇంకా మెల్లిగా ముదురుతున్నాయి అంటావు? ఎండలు మండిపోతూంటేను- ఈ చెలిగాళుపు ఆ చెవికిగొట్టుతూన్నది ఇప్పుడే-ఇంకా రోహిణీ కార్తిప్రవేశిస్తే ఏలాఉంటుందో?ఏం ఎండలో-ఎంలోకమో బ్రతికేఎత్తు కనిపించలా ఎక్కడాను-

ఓ ప్రక్క అగ్నిహోత్రపుభయాలు· మొన్నను-తూర్పుగుడిసెలు అంటుకొన్నాయి గదా. ఇళ్లే కొంగుపరిచి నడుంవాలిస్తే ఏలి గంద్రగోళం వినబడుతుందో అన్నభయమే. తుళ్లునవే .ఏ గుండెదుడుకు, ప్రాణం ప్రాణములో వుండదాయె. ఏం వేసంకాలమో-ఎల్లా గడుపుతామో-మృగశిర పవేశించించీదాకాను.

ఏమిటో మృగశిర-మృగశిర అని చంలుకొట్టుకోవడమేకాని అన్నికార్తులు ఓలాలుగనేవున్నాయి, జ్యేష్ఠమాసంలో శ్రావణభాద్రపదాల్లో-ఏమయినా చల్లబడుతుంటారా? ఉత్తమాట-చూడు ఋతువులుకూడా మారుతున్నాయి. రాజ్యాలు మారుతున్నట్లే.

అయితే ఈ తెల్లవాడి రాజ్యం అంయిపోతుందంటా రేమిటి?-ఏమిటో స్వరాజ్యం స్వరాజ్యం అంటారుకాని-కడవుల నీళ్ళు కదంకుండా సుఖంగా వున్నారు. ఆ పంతులుగారి దయవల్ల అబ్బాయి నాలుగురాళ్ళు తెచ్చుకుంటున్నాడు. నాలుగు గింజలువచ్చేపొలం చచ్చిపోయినవాళ్లి దయవల్ల మిగిలింది. ఇవి నల్పుకొని అవి మార్చుకొని తృణమో భణమో ఉన్నది పెట్టుకొని చల్ల ఉంటే పులుసులేక, పప్పుంటే పులుసులేక కలో గంజోతాగి కాలము వెళ్లబుచ్చుతున్నాము.

ఆ అయిపోయింది-నాకు 50 దాటి అరవైయోపడి వచ్చింది. బ్రతికినన్నాళ్ళు బ్రతుకుతామా? కళ్ళుమూసుకుంటే ఈ నాలుగురోజులు గడుస్తాయి కాని లోపల గుండెదుడుకు ఓటి ఉన్నది చెప్పొద్దూ? మా అమ్మకు కాలు చెయ్యిపడి 13 ఏండ్లు మంచంమీద తీసుకున్నది. అంత తీసుకున్నా బంగారవు తీగలాగ వొళ్లు మెరిసిపోతుంది. మెరవడంమాట దేవు డెరుగు గాని తీసుకోలేము. సుమా ఎవ్వరుచేస్తారు? నేనంటే మాఇల్లు- మా అమ్మగారిఇల్లు, ఎదురుబదురు గనుక-ఆవిడ కోడలు చేసినా చెయ్యకపోయినా-అడపా తడపా వెళ్లడం చూడడం-స్నానం చెయించడం-దొడ్డికి తీసుకువెళ్లడం-గుడ్డలు మార్చడం-జరిపేదానను. చూచావా అంత జబ్బులోనూ ఏనాడయినా నీళ్ళుపోసుకోకుండా వుందా? పట్టుబట్ట కట్టుకోకుండా తిన్నదా?-చచ్చే రోజుకూడా.

ఆవిడ అదృష్టము ఏమిటోగాని-నియయం ఆచారం భంగంకాకుండా తనువు తీర్చుకున్నది. ఇంతకూ ఆ భగమంతుడు దయవుంటే ఏదో స్వంతకొంపఅంటూ ఇదొటి నిల్చింది కనుక- ఇంకా ప్రాణంఉండగానే అద్దెకొంపల్లో ముల్లే-అవతలకు ఈడు-ఈడు అనిపించుకోకుండా అబ్బాయిలచేతిమీదగా- దాటిపోగలపోఅన్న

తృప్తిమాత్రం దొడ్డది. ఆస్తులు-పాస్తులు పోనీ ఆతాపత్రయ మేమిలేదు-మా అబ్బాయి అప్పు డప్పుడు అనుకుంటూంటాడుకాని-ఎంత ప్రాప్త మో అంతేదక్కుతుంది కాని-బంగారం కరిగించు కునిఅన్నంమీద వేసుకు తినగలమా ? భాగ్య మంతుడు తిన్నా ఆ పచ్చడీ మెతుకులే బీదవాడు తిన్నా అవచ్చడీ మెతుకులే కాతూ యంటే వారు ఈ కూర ఆ నార అని ఇంకో రెండువస్తువులు చేసుకుని పారెయ్యటంమేగా!

"అదేమిటి కొందరు భాగ్యవంతులు భోంచేస్టే-గేడెకట్టుమొదలులా గుంటుందేం ? ఆపత్తిని కూర్చోవడంకష్టం, ఇంకా కొందరు ఈ నవనాగరికులు కంచంలో చెయ్యికడుక్కుని చారుచల్లతాగే వెండిగిన్నెలలోనే తుపుక్కున ఉమ్మివేస్తారు-రోత' మనలో ఈ దురాచారం పోగొట్టాలి-ఒక ప్రక్కను భోంచేస్తుంటేనే-రెం డోప్రక్కన కాండ్రించడం ఉమ్మెయ్యడం ఇదేం మర్యాద ?

ఇంతకు ఈ ఎండలబాధ ఎలా ఏరుతుం ది ? కొద్దిగా నీరుమజ్జిగలో శొంఠి, కరివేపాకు, ఉప్పువేసి అది పుచ్చుకుంటూంటే ప్రాణం లేచి వస్తుంది. నాకు అల్లాఅనిపిస్తుంది సుమా ! సోళా సోళా అనిత్రాగుతారు. అ బుస్సున పొంగు నురగ-గాలి ముక్కుల్లోకి గొంతుకలోకివస్తుంటే ఉక్కిరిబిక్కిరి అవుతూంటే-ఏం ఆనందం, నాకు తెలియలేదుఅబ్బా ! దానిమాట అంటేనే వికా రం. ఏ చాకలో ఏ వడ్డి ఉప్పురోపట్టినసీళ్ళు గదా !

ఈ కాఫీహోటల్లుఅంటూ వచ్చిన

తరువాత బొత్తిగా హద్దూపద్దూ అంటూ పో యింది. తెల్లారగట్టే-వుసుకంపు. గొట్టుకుంటూ అరచేతి మీదనచా అట్టలుకట్టిన గుడ్డలు కట్టుకున్న ఉప్పరిది చీకట్లో మినప్పప్పు-రాళ్ళు మన్నుగడ్డలు_చిమ్మెటలు, పురుగులువేసి రుబ్బి ఉప్పుడుబియ్యం తొట్టెలలో ఇనుపముక్కలతో సహా వండిపడేసి_ఇంతగొడ్డు కారంన్నూ- (కోకోజెం) నెయ్యి. (దు ం ప నె య్యి) దాని మొగాన పడేస్తే-ఏంరుచోరుచి. ఎల్లా తింటారమ్మ ! పోనీ ఆచారతూట దేవుడెరుగు- రుచిఅయినా వద్దా? ఆరోగ్యం ఆరోగ్య అని నెత్తినోట కొట్టుకుంటూ ఈ మధ్య నుమ త్సరాల త రబడి ఏటేట ఆరోగ్య వాసరమూ ఆరోగ్య దివసమా_ఏదో ఓ తద్దినం, పెద్దారే వాళ్ళు అయినా ఈ ఇడ్లు తినరాదని చెప్పరేం ?

ఒక్క బెండకాయలు తరుగుతే-కాయ కాయకాకుండా- ముక్క ముక్క చూస్తేనేగాని పురుగుబయటపడదు-ఆమధ్య నీలగిరివెళ్లా-కాలీ కారు(C2u'9 flower)అని ఏదో ఒకకూర తెచ్చా రు_దానిలో ఆ పువ్వు-గుత్తులు గుత్తులుగా వుం టుంది. ప్రతిగుత్తి మొదలు చూడవలసిందేకదా- ఆకుపచ్చని పురుగు లుంటాయి-రంగులలో రంగుకలిసిపోతుంది. వెయ్యి కళ్ళెట్టెకు చూస్తేనే గాన్ని కనుపించదు ఇంక తోటకూర బాగు చేస్తామంటే నూతెడు నీళ్ళుపోసి కడిగినా-దాని అమ్మకడుపుకాలా _ వంటకూర తింటూంటే గసగస ఇసుకు-మొగాళ్ళచేతచివాట్లు - ఒడ్డించ డంకూడా సిగ్గు అవుతుంది.

నేను ఈ మాటఅంటే మా చెల్లెలన్న ది "ఓసెబ్బా మొగాళ్ల వ్రాతలుమాత్రం

శుద్ధంగావుండి చచ్చాయా ఏమిటి? తోలికూరలో తట్టెడుచీడ మనము ఏరిపారేస్తేవాళ్ళు దస్త్రాలదగ్గర వ్రాసిచింపేసిన చిత్తులుచూడు. తట్టలకుతట్ట లుంటాయి. వారుఅయితే వ్రాయాగలరు చింపెయ్యాగలరు. మనము అన్నంచిమిడితే ఏంచేస్తాము? రవపలుకంటే ఏంచేస్తాము? ఉప్పులో ఇసుక ఎంత అని తీసెయ్యగలము? పెసరపప్పులో రాళ్ళుగాలించి గాలించి కళ్ళు రాళ్ళు కట్టుకుపోతాయిగదా! అప్పటికి ఏ పలుకో ఆ ఒకటి దిగబడక మానదు. దీనికోసం రాద్ధాంతాలుచేస్తే నేనుమాత్రం సహించనుసుమా! మనిషిఅయినవాడికి తప్పురాకపోతే, మానుకు వస్తుందా? నాలుగురోజులు ఈ మొగాళ్లను పొయ్యి రాజేయమనండి! మనం దస్త్రంవద్ద కూర్చుందాం" అన్నది మా చెల్లెలు.

ఓ సేవు-అంత తొందర పడకే-ఈరోజులోను మగాళ్లు తప్పకుండా ఈ బదిలీకి వప్పుకుంటారు. ఏదో-ఇంట్లోని హాయిగా పడివున్నాము. వాకిట్లో కెందుకు లాగుతావు? చాలు ఈపాటికి. పొయిలో పిల్లి లేవవాలిగా! మనకిది వ్రాశాడు దైవము. వాళ్లకది వ్రాశాడు, కుండలలో కూర్చుని ఏలా వుంటామని వాళ్లు అనుకుంటో-వాళ్ళు ఎప్పుడూ ఎండలో తిరిగి ఏలావుంటారో అని మనము అనుకుంటాము-ఏ ఎండకు ఆ గొడుగు అన్న శాస్త్రం ఊర్కే-పోతుందా?-లే, మడిగట్టుకో, పశువులు వస్తున్నాయి. పక్షులుగూళ్ళుచేరుతున్నాయి. పిల్లలు మా రాముళ్ళు పెటుతారు:-త్వరగా వంట చేసుకుంటే రేపటిమాట రేపు.

ఎప్పుడు బయలుదేరుతామా అని వున్నది. ఇంటికేసి ముఖం తిరిగింది. ఎప్పుడు వెళ్దామా అని మనస్సు వాపోస్తోంది.

నే నెప్పుడు పువ్వులు జెడవేసుకున్నా బోర్లా ముఖంగా పడుకుంటా - జడవాలేస్తా - పువ్వులు నలిగిపోకుండాను. మా తమ్ముడు అమ్మమ్మకోసంనుంగెబెకుట్టున్నాడు. కా వుసఅన్నం దగ్గరకే రానియ్యడు. తీరా నేను ఉత్తరం వ్రాసిన తరువాత నీవు వెళ్లకపోతే ఏం బాగుంటుంది! ఏమిటో ముందే అనుకోవాలి కాని వస్తాము వస్తాం అని ఆఖరుకు రాకపోతే-పెద్ద మనుష్యులతోపని. మరోసారివస్తానని వ్రాసినా, ఇంతేకదా!

చూడండి తాతగారు, నామీద పట్టించాడేమిటి పీడి చలపాదన-ఒక్కటే చలపాటించడం.

అమ్మమ్మగారింటిమీద మల్లె రెండు గదులువేస్తే మన డాబామీద కూడాను పడి ఉంటాయి.

అబ్బ ఏం పిల్లమ్మా - మాట బారనియ్యదు-మాటా లేదుమంచీ లేదు. తనసాదేసాద. ముది పేరక్కలాగా మాట్లాడుతుంది.

"భవతి భిక్షాం దేహి"

ఇల్లాలు-అయ్యా, బియ్యం నిండుకున్నాయి గాని వెళ్లిరండి.

అయ్యా-చెయ్యిఊరోక్కలేదు" వెళ్లిరండి.

అయ్యా-ఈ రోజున పెట్టగూడదు, వెళ్లిరండి.

అయ్యా-ఈరోజు కార్యంగాని, దయచేయండి.

ఆయిన ఏమిటండీ, అలా మాట్లాడుతాడు? కట్టెవిరిచి పొయిలో పెట్టినట్టే. అయితే మొదటి నిమిషందాటితే, ఎంత సౌమ్యం! ప్రాణం ఇచ్చి మాట్లాడుతాడు. చెప్పింది చేస్తాడు. చాతకానిది చేస్తానని ఆశపెట్టి - ప్రొద్దున రా - సాయంత్రం - ప్రొద్దున ఇవాళ - రేపు అని ఆయాసం పెట్టడు. అన్నమాట ప్రకారం జరుపుకుంటాడు సుమండీ, వెయ్యిఅనండి - ఆడితప్పనివాడే పెద్దమనిషి అనుకోండి

ఇంక ఇటువంటివాళ్లవద్ద గుట్టు, మట్టు లేదుగదా ! - కుండ బద్దలేసి చెప్పడమే - ఒక్కటే దెబ్బ రెండేతుళ్ళు. మసిపూసి నేరేడికాయ చేయడం అరచేయిచూపి మోచెయ్యి నాకించడం. మాటమెత్తన చేతకరుకు... అయితే ఒక్క మాట ఆయనవద్దకెళ్లి - గుంయి - గుంయిలాడితే అదో నమ్రత అనుకోడు - నమ్రతఅంటే - కర్త - కర్మక్రియా వేకుండా వాక్యం మాటానా? నేను హిందూ కాలేజి - జి. మ్ - అంటే ఏమనుకోవాలి అంటారుమీరుచెప్పండి. నేను హిందూకాలేజి - తాను హిందూకాలేజిలో చదువుతున్నానని చదువుతే ? - ఏంకావాలీ? గుర్రపుబండి ఎక్కి వెళ్తాడా? టీపార్టీ - ఇస్తాడా? జీతం ఇమ్మంటాడా? - పరీక్షదరఖాస్తుకు సహాయమా ? ఏంకావాలి? ఇంతసేపు కాలంఎందుకు పాడు ?

ఎత్తుకుంటే ఏఏ - ఏ ఊహూ మాట్లాడడే - చేతులు నలుపుకుంటాడు - మూతి విరుస్తాడు మొఖం చిట్లిస్తాడు. - మోకాలు మించి గోడ మీద పాదం పెట్టుతాడు - చెయ్యిఎత్తి పైదూలపుకుంటాడు - పంగ తెరిచి - కుచ్చెళ్ళు సవరిస్తాడు. లేక వెనుకకు చెయ్యిసాచి గోకడం మొదలెడుతాడు. క్షణం - సరీగా నిలువలేకా పిల్లలు - ఏం పిల్లలో ఏంలోకమో ! - నడాన ఆయన ఎత్తిపోసుకోడం ఎందుకు.

అన్నట్టు, మరచిపోయినాను, అయ్యో నా తెలివి, తేటమండినట్టేది నేనువుంది. ఏదో చెప్పాలనుకున్నానమ్మా - అరే, నాలుకమీద ఆడుతోంది - ఇప్పుడు చెపుదామనుకున్నానే. ఇంటిదగ్గిరనుంచి ఈమాటలు చెప్పడానికే ప్రత్యేకంగా బయలుదేరాను సుమా !

రాత్రి అల్లా అబ్బాయిలు పోరుపెట్టి ఏడుస్తున్నారు, ఎందుకో తెలియదు - ఏమైనా ఝడుసుకున్నారేమో! అక్కడికీ - పోనీలే అని గుప్పెడు మెరపకాయలు దిష్టితీసి పొయ్యిలో వేశాను - కాని ఉరూ నాడూకూడా ఏకం కావలసిన ఘాటు. ఎక్కడా గుఫ్ చఫ్ లేకుండా వుందమ్మా - దీనినే కావున్ను దిష్టి అంటారు !

కాకపోయినా - ఏమి రొష్టుఅమ్మ - రోజల్లా - ఒక్కటే శాపనార్థాలమ్మా. నీవుచావా - నీ అమ్మకడుపుకాలా - దిక్కుమాలినవాడ ! నీ దుంప తెగ ! అనేకదా - తెల్లవారేసరికి మొదలు ప్రొద్దుకూకిందాకా ఒకటేపాట. ఇదేనా పిల్లలు పెంచడం.

విన్నారా ఈమధ్యను. పాపం ఆ అమ్మాయి వెంకబరత్నమ్మ మొగుడు పోయినాడు. మనుగడుపులన్నా ఎరగరు కదా - ఇంతలోకే అమ్మలక్కలు అంతా వచ్చేసి వక్కటే గోల మెట్టు ఒద్దని - పసుపు ఒద్దని - కుంకం ఒద్దని - పేరటం పనికిరాదని - చీరొద్దని నగలొద్దని - ఏమిట

మ్మమ్మ! ముక్కు పచ్చలాంటి పసిబిడ్డగదా-దానికేం దెలుసు-శుభం? అభంను? ఏంపాపం చేసుకున్నామో కాని ఇటువంటి కష్టకాలం కడప వలసి వస్తుంది.

ఇవేం చదువులోకాని తల్లితోడుఅన్న మాట లేదుగదా! ఎదిగిన ఆడబిడ్డగదా అని కాస్త చేతికిఅందిందికదా అని ఓ చెంబుతప్పాల ఇక్కడది అక్కడ అక్కడది ఇక్కడ ఏమన్నా వేస్తారా? ఇంక మాటా మంతీ చూదామంటే ఓవరసా వావి ఏమన్నావుందా? నోటికి వింత మాటొస్తే అంతమాటేనా? ఎంత కోవంవస్తే అంత కోపం చూపించడమేనా! పెద్దాపిన్నా అంటూ ఏమన్నావుందా? మంచిచెడ్డా ఎరుగుదురా? ముందూ వెనుకా తెలుసునాఏమన్నాను? ఏం మురుపు చూచుకునో బోర్లపడిపోతున్నారు. మొగ ఆడ అంటూ ఏమన్నా భేదంవుందా? ఇదివరదాకా ఒక్క మొగాళ్లకే యీ తెగులు పుట్టింది అనుకున్నాము. ఇప్పుడు యీ ఆడ మేళంకూడా అందులోనే చేరింది ఎప్పుడైనా అబ్బాయి ఇల్లోంచివస్తేబట్టలు మార్చిం తరువాత పిల్లుల దగ్గరకు రావడం పిచ్చా-పాటి మాటాడడం అంటూఉండేది ఇప్పుడేమిటి? కస్సూ బుస్సూ మాటయేకాని అమ్మా అని పిలుస్తారా? ఇంక నాన్న దగ్గరకు వెళ్లడం మాట్లాడం ఎప్పుడూలేదు. ఇంక వీరో తమ పని తమ మాట ఖ తమ పార్టీ తమ కాగితాలే గాని ఇల్లువాకిలి పెంళ్లాం బిడ్డలు సంసారం చట్టుబండలు ఏమయినా ఉంటేనా? అన్నీ నా తలచుట్టూ మేటిచుట్టుకుంటున్నాను.

ఈ సంసారం ఎల్లా ఈదడం ఈ ఆడపిల్లలకుఎవరు కుదురుస్తారుసంబంధాలు? కట్నాలు చూడబోతే ఈ శారదాబిల్లు చట్టమో ఏదో అంటారు. ఈ మధ్య ఆడవాళ్ళసభలలోగూడ మోగిపోయింది. ఆ బిల్లు వచ్చింతరువాత కట్నాలు ఏమయినా తగ్గుతాయోమోఅనుకొన్నాను, పెరిగాయి. ఇంకా 14 ఏళ్ళు చాలవట. ఏళ్లు పెరిగినకొద్దీ కట్నాలుకూఏండ్లుపెరమేగా పోనీ యుక్తవయస్సు వడాచ్చిందనిగయినా దయాదాక్ష్యణ్యాంవుందా? అందువల్ల మనం కట్నాలుఇచ్చుకోవట లేకపోవడం, పిల్లలు చెల్లైడ ఏగడం, పోనీలెండివాళ్లేచేసుకుంటారు-లేదా మొగుడు మొద్దులుఅంటూ బాధలేకుండా స్వేచ్ఛగావుంగారు. బారుబూరుమని ఈ పెళ్లిళ్ళుచేసుకుని మనంమాత్రం బావుకున్నదేమిటి? ఏడాది ఏడాది ఓకాల్పున్నా చెరువు నుంచి బిందనీళ్లు దింపడం, వురిటిగదిలో నీళ్ళాడడం పెద్దపురుడు వెళ్లినప్పటినుంచి మళ్ళీ చీపురుకట్ట అలుగ్గుడ్డా మహము తయారు.

ఇంకా తెల్లవారక ముందే ప్రొద్దెక్కక ముందే అంటే-మొగాళ్ళు బ్రాడు పుల్లలు నోట్లో పెట్టుకొని చెరువు కట్టమీద కూర్చుని-వచ్చే ఆడదాన్ని-పోయే ఆడదాన్ని-ఎగా-దిగా చూడడం ఇంకా మొదలెట్టక ముందే, ఆ పది బిందెలు నీళ్ళు చచ్చినట్లు మొయ్యడం అక్కడి నుంచి తడిబట్ట మడిబట్ట మన ంతయారు-చంటి బిడ్డకు ఉగ్గూ-పాలు ఇయ్యడం-ఆ-నీళ్ళుపొయ్యడం-ఇవన్నీ ఆ అమ్మమీ‿ ఈ అమ్మమీద వదలిపెట్టడం-వంటపొయ్యి పచ్చికట్టెలు-పొగ కళ్లకళ్ల నీళ్ళు మనము సిద్ధము-ఇదివర కెన్నడూ

ఎరుగం. ఇప్పుడే మా కంటిడాక్టర్లు వచ్చిన తరువాత రెప్పలలో కొయ్యగండలనీ-ఇసుకోసినట్టుండడం- రెప్పలు మెరమెరలాడడం-ఎప్పుడూ కళ్ళు నీళ్ళు కారడం, ఎండ చూడలేక పోవడం-నల్లగుడ్ల మీద తెల్లపొర పొట్లూ మీద ధనారింపు. ఇదోటి మాయరోగం మా పాలిటికి ప్రాప్తించింది-అసలే దరిద్రం-అందులో గంపెడు పిల్లలు దానికితోడు రోగం.

పెండ్లాం: అత్తిల్లు చూడబోతే అద్దాన్నం పుట్టిల్లు చూడపోతే నిరామయం ఏమిటో యీ ఆడపుట్టక పుట్టకపోతేమి? ఈ బాధలు పడకపోతేమి?

మొగుడు:—అయితే బాగానేవుంది. శ్రావణ మంగళవారాలనోము, శుక్రవారాల నోము, సావిత్రీ గౌరీదేవి చిట్టిమెట్టు మగనోములు పాటలనోములు ఈ నోములన్నిటిలోను పూజ చేయండి ఆడవాళ్ళంతా మొగవాళ్ళ యిపుట్టాలి అప్పుడు ప్రపంచమంతా మొగమయం అవుతుంది. మీ బాధలు తీరుతాయి.

పెళ్లాము:-ఆ తీరతాయి తీరాలి ఈమాటలు వింటానికి పాపం సమయానికివస్తారు? ఎప్పుడూ కుండల్లో గుర్రాలుతోలుతూ ఇక్కడే కనిపెట్టుకుని కూర్చోడం ఎందుకు? పైగా కేక లేదు పిలుపు లేదు. సరాసరి లోపలకు తోసుకు రావడమేనా! మడిమైల పెద్దబట్టా చిన్నబట్టా వుంటుంది. బొత్తిగా ఎగ్గుసిగ్గు లేక పోతే సరి ప్రక్కపినబడదు. విధిలచే కేకలు దొడ్లోకి రా వచ్చునా? అని ఎవరికైనా ఏసంగతైనా నచ్చచెప్పాలి కాని రాపాడిస్తే ఏంలాభం?

నా మనుమనికి నా వద్ద చాలా చనువు పెద్దవాళ్లు బిడియపడతారు గాని పిల్లలకు చొరవఎక్కువ. ఎక్కడ నదురూ బెదురూ ఉండదుగదా.


**THE NEW ROYAL TYPEWRITER**

**with *MAGIC* MARGIN***



Think of it! A new revolutionary feature, the greatest time-and effort-saving improvement ever placed on a typewriter! No more setting margin stops by hand......

The operato ·nerely positions the carriage—MAGIC Margin does the rest.

*PLEASE CALL OR WRITE FOR FULL PARTICULARS*

**ADDISON & CO., LTD., Mount Road, MADRAS.**

Source: Press Academy Website, Anandavani Magazine, 1940

Disclaimer: This SELECTIVE topic/article/write-up of Sri Bhogaraju Pattabhi Seetaramaiah gaaru is nostalgic. It has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience.

No intention what so ever of copy right violation is involved.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with due apologies.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/